క్లుప్తంగా

శివభక్తులకు అన్నదానం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో కార్తీక మాసం పురస్కరించుకొని శివమాలధారులకు ఆదివారం అన్నదానం చేశారు. ఆర్టీసీ కార్గో రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీధర్‌గౌడ్, డాక్టర్ రాందాస్‌నాయక్ సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 40 రోజుల పాటు అన్నదానం ఉంటుందని గురుస్వామి ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. 10కెఎల్‌కె152 అన్నప్రసాదం స్వీకరిస్తున్న శివస్వాములు

రైతుల ఆందోళన



కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో ఆరోరోజు ఆదివారం రైతులు ఆందోళన కొనసాగించారు. 60 సంవత్సరాలుగా భూమి నమ్ముకొని సాగుచేసుకుంటున్నామని కొందరు దౌర్జన్యంగా భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేసే వరకు నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. వంటావార్పు చేసి నిరసన తెలిపారు. రైతులకు కాటికాపర్లు, గంగిరెద్దులవారు మద్దతు ఇచ్చారు.

ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యేకు స్వాగతం



మన్ననూర్: అధికార పర్యటనలో భాగంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వారం రోజుల పాటు విదేశీ పర్యటన ముగించుకొని ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. మన్ననూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి, శ్రీనివాసులు, రమణ, రాజులు ఎమ్మెల్యే వంశీకృష్ణకు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.

ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు



లింగాల: మండలంలోని అంబట్‌పల్లి శివారులో ఆదివారం డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. వాహన తనిఖీలో ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి పట్టుబడినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుభ్రత పరిశుభ్రత



వెల్దండ: మండలంలోని బుధార్‌పేట ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుభ్రత–పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవరణంలోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిందం కృష్ణయ్య, పాండు, శ్రీశైలం, వేణు, దేవేందర్, శ్రీధర్, రవికుమార్‌రెడ్డి, మల్లేష్, శ్రీకాంత్, సాయినాథ్‌రెడ్డి, కేదార్, రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విశ్వకర్మ లీడర్ అవార్డుకు గోపాలాచారి ఎంపిక

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని తూడుకుర్తిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గన్నోజు గోపాలాచారిని విశ్వకర్మ లీడర్ అవార్డుకు ఎంపికైనట్లు విశ్వకర్మ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005–06 సంవత్సరంలో 200 మంది విద్యార్థులను ఆర్‌బీసీలో చేర్పించి బడిబాట పట్టించారని పేర్కొన్నారు. ఈ నెల 13న ఢిల్లీలోని అంబేడ్కర్ భవన్‌లో కేంద్ర మంత్రుల అవార్డును అందజేస్తారని తెలిపారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు తక్కువ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వ్యవసాయ పనులతో పాటు కార్తీకమాసం కారణంగా 4 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



కోడేరు మండలం ఎత్తంలో..



ఉప్పునుంతలలో ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న అచ్చంపేట ఆర్డీఓ మాధవి



తెలకపల్లిలో..

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



చారకొండ మండలం జూపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీను

సాక్షి, నెట్‌వర్క్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే ఆదివారం జిల్లా వ్యాప్తంగా కొనసాగింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలను నమోదు చేసుకుంటున్నారు. అధికారులు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

■ నాగర్‌కర్నూల్ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 600 కుటుంబాలను సర్వే చేసినట్లు ఎంపీడీఓ కోటేశ్వర్ తెలిపారు. ఒక్కొక్క ఇంటి వద్ద అరగంట సమయం పడుతుందని ఎన్యుమరేటర్లు తెలిపారు.

■ కొల్లాపూర్ మండలంలోని కుడికిల్ల, అంకిరావుపల్లి, ఎల్లూరు, బోడబండ తండా, గ్రామాలలో ఇంటింటి సమగ్ర సర్వేను మండల స్పెషల్ అధికారి దివ్యజ్యోతి ఎంపీడీఓ మనోహర్‌తో కలిసి పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు సూచనలు ఇచ్చారు.

■ కల్వకుర్తి మండలంలోని 24 గ్రామాల్లో సర్వే కొనసాగింది. ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలు నమోదు చేసుకున్నారు.

■ కోడేరు మండలంలోని ఎత్తం, నర్సాయిపల్లి, మైలారం, నాగులపల్లి తండాలను తహసీల్దార్ విజయ్‌కుమార్ సందర్శించి ఎన్యూమరేటర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సురేందర్, జమ్ములయ్య తదితరులు పాల్గొన్నారు.

■ తాడూరు సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ సురేష్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీఓ బ్రహ్మచారి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

■ తెలకపల్లి మండల కేంద్రంలో సర్వేను ఆర్డీఓ సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలన్నారు. గౌరారంతోపాటు అన్ని గ్రామాలో రెండో రోజు సర్వే కొనసాగింది. తహసీల్దార్ జాకీర్‌అలీ, ఎంపీడీఓ శ్రీనివాసులు, నయాబ్ తహసీల్దార్ లక్ష్మన్, పంచాయతీ కార్యదర్శులు భాస్కర్, ప్రవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

■ పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలులో ఎంపీడీఓ నాగేందర్ సర్వేను పరిశీలించారు. ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు.



నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురంలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

■ లింగాల మండలంలోని అప్పాయపల్లి, మల్లోనిచెర్వుతండా, శ్రీరంగాపూర్, గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వే పనులను ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ చంద్రశేఖర్ పర్యవేక్షించారు. సమాచారం ఇవ్వడానికి ప్రజలు నిరాకరిస్తున్నారని సర్వే సిబ్బంది తెలిపారు.

■ ఉప్పునుంతల మండలంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే మందకొడిగా సాగుతోంది. ఉప్పునుంతలలో అచ్చంపేట ఆర్డీఓ మాధవి ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించారు. రెండోరోజు ఎన్యుమరేటర్లు 5 నుంచి 10 కుటుంబాల వరకు సర్వే చేశారు. మండలంలో మొత్తం 72 మంది ఎన్యుమరేటర్లు, ఆరు మంది సూపర్‌వైజర్లు పాల్గొన్నారని ఎంపీడీఓ మోహన్‌లాల్ తెలిపారు.

■ చారకొండ మండలం జూపల్లిలో సర్వేను కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను పరిశీలించారు. కుటుంబసభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. మొత్తం 17 గ్రామాల్లో సర్వే కొనసాగుతోందన్నారు. తహసీల్దార్ సునీత, డీటీ విద్యాధరి, ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్, గణేష్, అల్తాఫ్, తదితరులు ఉన్నారు.

■ బల్మూర్ మండల కేంద్రంతో పాటు రాంనగర్ తండాలో ఎంపీడీఓ రాఘవులు సర్వేను పరిశీలించారు. 78 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం



కల్వకుర్తిరూరల్: విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆయన సందర్శించారు. భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మినరల్ వాటర్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, నాయకులు ఉన్నారు.

స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతు



తాడూరు: మండలంలోని పాపగల్ సమీపంలో ఉన్న దుందుభీ వాగు నిర్మించిన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంతో రైతులు డబ్బులు పోగు చేసుకొని రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండటంతో సొంతంగా పనులు చేయించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



తాడూరులో ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ సురేష్



వెల్దండలో దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్‌ఓలు

తాడూరు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని ఆర్డీఓ సురేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటు నమోదు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. దరఖాస్తులను బీఎల్‌ఓలకు అందజేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్మయి, సిబ్బంది వెంకటేష్, ప్రీతమ్ ఉన్నారు.

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి, మైలారం గ్రామాల్లో తహసీల్దార్ విజయ్‌కుమార్ ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు కోసం ఫారమ్–6, అభ్యంతరాలకు ఫారమ్–7, మార్పులు, చేర్పులు, నివాస గృహాలు, దివ్యాంగులను గుర్తించుటకు ఫారమ్–8 ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. బీఎల్‌ఓలు, సిబ్బంది ఉన్నారు. 10కేఎల్‌పీ 302 నర్సాయిపల్లిలో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

వెల్దండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులు ఓటరు నమోదు చేసుకున్నారు. మండలంలో మొత్తం 39 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ కార్తీక్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శంకర్‌నాయక్, మాసమ్మ, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ



లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయం, అంజనేయస్వామి ఆలయాల్లో కార్తీకమాసం పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం రామాలయంలో దీపారాధన, ఆంజనేయస్వామి ఆలయంలో ఆకు పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయ్యప్ప, ఆంజనేయస్వామి మాలాధారులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

15న కార్తీకపౌర్ణమి మహోత్సవం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఈ నెల 15న శుక్రవారం షిర్డీ సాయిబాబా ఆలయంలో కార్తీక మహోత్సవం నిర్వహిస్తునట్లు ఆలయ అర్చకులు శివయ్య, ప్రవీన్‌లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5.30 గంటలకు సుప్రభాతసేవ, 7 గంటలకు గణపతి పూజ, 7.30 గంటలకు క్షీరాభిషేకం, మంగళహారతి, మత్రంపుష్పం, 10.30 గంటలకు సత్యనారాయణస్వామి వ్రతం, 12 గంటలకు సాయినాథుని మంగళహారతి తీర్థప్రసాదం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్ర స్వామివారి పల్లకిసేవ నిర్వహిస్తునట్లు తెలిపారు.

13న సామూహిక తులసి కల్యాణం

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని రాంనగర్ కాలనీలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 13న తులసి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కందడై వరదరాజన్ అయ్యంగార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, దీపారాధన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

24న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాక



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రానికి ఈ నెల 24న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రానునట్లు స్వేరోస్ జిల్లా నాయకులు మబ్బు రాము, మంతటి ఆనంద్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సంపత్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా వేదికగా స్వేరోస్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ దివస్‌సభకు హాజరవుతారని తెలిపారు. జిల్లా కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన గుంత లక్ష్మమ్మ ఇటీవల మృతిచెందింది. ఆదివారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు నాగోలు నాగిరెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.7500 ఆర్థికసాయం అందజేశారు. అడ్వకేట్ రామ లక్ష్మణ్, సూర్యశేఖర్‌రెడ్డి, పాపకంటి బాలస్వామి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గుంత భాస్కర్ తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: తమతో పాటు చదువుకొని అకాల మరణం పొందిన స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు చిన్ననాటి మిత్ర బృందం రూ.లక్ష పోగు చేసి ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని మల్లాయిపల్లికి చెందిన పస్పుల స్వామి ఇటీవల మృతి చెందాడు. అతడితో పాటు 2009–10 విద్యా సంవత్సరంలో చింతకుంట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న చింతకుంట, మల్లాయిపల్లి, మల్లాయిపల్లితండా, చందాపూర్ గ్రామాల మిత్ర బృందం అందరూ కలిసి రూ.లక్ష జమ చేసి, నగదును మిత్రుడి ఇద్దరు కుమార్తెల పేర్ల మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు వారు పేర్కొన్నారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బీమాచారి



అచ్చంపేట రూరల్: ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన కోలంటి బీమాచారిని నియమించారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె. హుస్సేన్, ప్రధాన కార్యదర్శి రవిలు ఎంపిక చేసి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీమాచారి నియామకంపై పట్టణ ఫొటో, వీడియోగ్రాఫర్లు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

గద్దర్ విగ్రహ కమిటీ కన్వీనర్‌గా లక్ష్మణశర్మ



కల్వకుర్తిరూరల్: గద్దర్ విగ్రహ కమిటీ కన్వీనర్‌గా లక్ష్మణశర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలో ప్రజాయుద్ధనౌక గద్దర్ విగ్రహ ఏర్పాటు కోసం కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణశర్మ మాట్లాడుతూ గద్దర్ ఆశయసాధనకు కృషి చేస్తానన్నారు. పాటలతో గద్దర్ ఎంతో మందిని చైతన్యవంతం చేశారన్నారు. కార్యక్రమంలో సదానందంగౌడ్, జంగయ్య, బొజ్జన్న, గోపాల్, భిక్షపతి, నర్సింహులు, శేఖర్, శ్రీకాంత్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మండల కార్యదర్శిగా లక్ష్మణ్

తెలకపల్లి: సీపీఎం మండల కార్యదర్శిగా గోపస్ లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం మండల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. అదేవిధంగా మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: దళితుల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగనూలు గ్రామ పరిధిలో దళితులకు సంబంధించిన 3.5 ఎకరాలలో సమస్యలు ఉండటంతో న్యాయవాదిని సంప్రదిస్తే దళితులను నమ్మించి భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపించారు. మాయమాటలతో మోసం చేసిన నాయ్యవాదిపై విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు భగవంతు, శ్రీను, బాలయ్య, రాము, ఊశన్న, విష్ణు, పరశురాం, జంగన్న తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న వెంకటయ్య

అచ్చంపేట రూరల్: ముదిరాజ్‌ల అభ్యున్నతి ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో ముదిరాజ్ కులస్తుల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడారు. ముదిరాజ్ మహాసభ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తయ్యిందని పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి ముదిరాజ్ మహాసభ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అజమోని నరసింహ, ప్రధాన కార్యదర్శిగా పదిర బాలరాజు, ఉపాధ్యక్షుడిగా లింగస్వామి, బాలస్వామి, శ్రీశైలం, కార్యదర్శులుగా శ్రీనివాసులు, సుభాష్, సాయిబాబు, సురేష్, కోశాధికారిగా పుట్ట పాపయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, రేణయ్య, దశరథం, వెంకటయ్య, సత్యనారాయణ, ఆంజనేయులు, మోహనయ్య, సురేష్, శ్రీశైలం, పాపయ్య, రవి, అశోక్, శ్రీనివాసులు, వీరయ్య పాల్గొన్నారు.

చిన్నారులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: చిన్నారులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సత్యసాయి సేవాసమితి కన్వీనర్ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయిమందిరంలో బాలవికాస్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉయ్యాలవాడ, ఎండబెట్ల గ్రామాల్లో కూడా తరగతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలవికాస్ గురువులు రాఘవేందర్, సతీష్‌కుమార్, రవికుమార్, సుప్రజాత, లలిత, సుజాత, శివమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు వనభోజనం

దోమలపెంట: రాములమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్న స్వాములకు ఆదివారం వన భోజనం(భిక్ష) ఏర్పాటు చేశారు. కటకం వెంకటేష్, అయ్యప్పస్వాములు ఉన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి



తెలకపల్లి: పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, పత్తికి మద్దతు ధర ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం మండల మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ పేరుతో సీసీఐ అధికారులు మద్దతు ధర ఇవ్వకపోవడం సరికాదన్నారు. దీంతో పత్తి రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారన్నారు. ఇప్పటికైన సీసీఐ అధికారులు ఎలాంటి షరతులు లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మండల కార్యదర్శి గోపస్ లక్ష్మన్, నందిపేట భాస్కర్, జగదీశ్, విజయ్‌గౌడ్, మల్లయ్య, మైసయ్య, బుచ్చయ్య, యాదమ్మ, గోరటి కాశన్న పాల్గొన్నారు.

అద్దె భవనంలో సివిల్ సప్లయ్ గోదాం

పెద్దకొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలకు రేషన్ బియ్యం సరఫరా చేసే సివిల్ సప్లయి గోదాం అద్దె భవనంలో కొనసాగుతోంది. అద్దె భవనంలో 10 లారీల బియ్యం మాత్రమే నిల్వ చేసేందుకు కెపాసిటీ ఉంది. ప్రతి నెల రేషన్ బియ్యం డీలర్లకు సకాలంలో సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారు. పెద్దకొత్తపల్లి మండలంలోని 33 గ్రామాలతో పాటు కోడేరు మండలంలోని 10 గ్రామాలకు కూడా సివిల్ సప్లయ్ గోదాము నుంచే రేషన్ బియ్యం సరఫరా కావాల్సి ఉంది. బియ్యం నిల్వ చేసేందుకు స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పక్కా భవనం కోసం నిధులు మంజూరైనా అధికారులు స్థలం చూపించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయని స్థానికులు పేర్కొన్నారు.



పెద్దకొత్తపల్లిలో సివిల్ సప్లయ్ గోదాం

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ అనురాధ

అచ్చంపేట: ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీబీఎం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చిక్కుడు అనురాధ అన్నారు. ఆదివారం అచ్చంపేట బీఆర్ అంబేడ్కర్ ప్రజా భవన్‌లో అనుషా ప్రాజెక్ట్సు ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై శంకర్ నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 890 కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 150 మందికి సర్జరీ అవసరమని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 130 మందికి సర్జరీ చేశామన్నారు. మాచారానికి చెందిన జలంధర్‌రెడ్డి సహకారం మరచిపోలేదమన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ జి.రాజేందర్, మార్కెట్ చైర్మన్ రజిత, కౌన్సిలర్ సునీత, మాజీ ఎంపీపీ రామనాథం, పాలశీతలికరణ చైర్మన్ నర్సయ్యయాదవ్, ఎ.తిరుపతిరెడ్డి, నేత్రాలయ నిర్వాహకులు రేణయ్య, రాజేష్, సైదులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
నాగర్‌కర్నూల్ జె. సంపత్ కుమార్ - 88865 67081
కొల్లాపూర్ వై. కురుమూర్తి - 79979 58205
అచ్చంపేట / కల్వకుర్తి యం. విజయ్ - 99630 23777

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్
9951602829
పి. మధుసూదన్ గౌడ్: 90100 06785